# రంభా శక్రపాంక్తేయం



భానుమతీ రామకృష్ణ

ఇంద్రుడు సింహాసనాసీనుడై రంభ నాట్యాన్ని చూసి ఆనందిస్తున్నాడు — నాట్యం అయిపోయింది. నారదులవారు ప్రవేశించారు.

ఇంద్రుడితోబాటు సభాసదు లంతా నారదులవారికి నమస్కరించి ఆశీర్వాదా లందుకున్నారు — చివర్లో రంభకూడా నారదులవారికి నమస్కరించింది.

"కల్యాణమస్తు - ఏం రంభా ! ఖులాసాగా వున్నావా ? నీలో కొంచం మార్పు అగపడుతోంది — ఏమిటీ !" రంభ కాస్త సిగ్గు పడుతూ,

"మరేంలేదు స్వామీ...యీమధ్య శరీరం కొంచం భారం అవుతోంది-"

నారదులవారు నవ్వారు—

"సదా నృత్యంచేసే నీకు ఒళ్లు భారంకావడం ఏమిటీ?"అని.

''ఎల్లప్పుడూ నృత్యంచేయడానికి యీమధ్య అవకాశం కలగడం లేదు స్వామీ - యీ దర్బారులో ప్రతిరోజూ నాట్యం చేయడం తప్ప మిగతా సమయాల్లో ఏం పని వున్నది !... ఇంద్రులవారీ మధ్య నా కేమీ పనికూడా కల్పించడంలేదు."

"ఆ మాటా నిజమే !- యిటీవల ముల్లోకాల్లోనూ నీ నృత్య గానాలనే సమ్మోహనాస్త్రాలతో ఎవర్నీ బంధించడం లేదు...అంతేనా ! ... అయినా ఇంద్రుడు మాత్రం ఏం జేస్తాడు! ... కాలంమారిపోయింది...రోజులూ మారాయి. రంభంటే ఎవరు ?...అని అడిగే స్థితి వచ్చింది..."

అంతవరకూ నారదులవారి మాటలు శ్రద్ధగా ఆలకించిన ఇంద్రుడు ఉలిక్కిపడి......

''అదేమిటి నారదా ? రంభ నవమానిస్తున్నారా?... లేక ఎక్కడైనా కలహభోజనానికి ఏర్పాటా ?''

"నారాయణ ! నారాయణ !! అదేమిటి, ఇంద్రా !...నేను రంభ నవమానిస్తానా ?...రంభ నవమానిస్తే అది నిన్ను అవమానించడమే అవుతుంది. అసలు రంభకు జరిగిన అవమానానికి నేను బాధపడుతున్నాను...ఆ సంగతి చెప్పడానికే పనికట్టు కొచ్చాను.''

రంభ ముఖం చిన్నబోయింది...అది చూచిన ఇంద్రుడు.

"రంభ కవమానం జరగడమా ? ఎక్కడ ?—ఎవరా దురహంకారులు ?" అంటూ కోపంతో లేచి నిలబడ్డాడు.

దర్బా రంతా ఒక్కసారిగా ఆశ్చర్యంలో మునిగిపోయింది.

నారదులవారు చిరునవ్వుతో మౌనంగా వుండడం చూసి,

"నారదా ! ముల్లోకాల్లో ఎక్కడున్నాసరే రంభ నవమానించిన ఆ గర్విష్ఠిని నా వజ్రాయుధానికి...''



''ఆ...ఆ...ఆగు ఇంద్రా-! త్వరపడకు...నీ వజ్రాయుధానికి పనే లేదు...పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం ఎందుకు!...రంభ నవమానంగా మాట్లాడింది కేవలం ఒక మానవమాత్రుడు-"

''ఆ!...మానవుడా? ఎవ రతను? ఎంత గర్విష్ఠి! ఎంత దురహంకారి!-" అనేగుసగుసల్తో ఇంద్రదర్బారు తాణికిపోయింది.

ఇంద్రుడి కోపం మిన్నుముట్టింది.

"ఏమిటీ? కేవలం ఒక మానవుడు రంభను అవమానిస్తాడా?... అతనికి అంత కండకావరమా?" ...

"ఛా ఛా, ఇంద్రా, పొరపాటు...పాపం. అతనికి కండల్లేవు... బక్కచిక్కిన శరీరం...సన్నగా పొడుగ్గా వుంటాడు..."

''మరి అలాంటప్పుడు రంభను మించిన అందగత్తె అయినా అయివుండాలి అతని భార్య...అందుకే అంత మిడిసిపాటు."...

"నారాయణ...అసలు విషయాని కొచ్చావ్...అతడికి భార్య లేదు...భార్య పోయి చాలా ఏండ్లయింది...మళ్ళీ పెళ్ళికూడా చేసుకోలేదు...పెళ్ళంటే అతనికి పెద్ద అభిప్రాయమూలేదు...చాలా విచిత్ర వ్యక్తి...రంభను గురించి ఎంత తేలిగ్గా మాట్లాడా దనుకున్నావ్!...ఇంతవరకూ రంభ నంత చులకనగా ఎవరూ మాట్లాడటం నేను వినలేదనుకో...అయినా ఒక్క రంభనేమిటి...నిన్నుగూడా నానామాటలూ అంటూంటే వినలేక చెవులుమూసుకుని పరుగెత్తు కొచ్చాను." ఇంద్రుడు పళ్ళు పట పట కొరుకుతూ,

"ఆపు, నారదా, ఆపు...నే నిప్పుడే వెళ్ళి ఆ దురహంకారి కండలు...''

"ప్చ్-హయ్యో! మళ్ళీ కండలు కండ లంటా వేమిటయ్యా, అది అతనిదగ్గర లేవన్నానుగా!...ఇదుగో నువ్వు యిచిన్న విషయంలో కలగ జేసుకోడంకంటే పెద్దవాడిని చెప్తున్నాను... ఎవర్నయితే అవమానంగా మాట్లాడాడో వారినే పంపు" ...

రంభ గాభరాపడుతూ, "నన్నా?" అన్నది...

"రంభనా? ఆ విరసుడి దగ్గిరకా?...రంభంటే ఎవరో తెలీయని ఆ మూర్ఖ మానవుడి దగ్గిరకు రంభను పంపమంటారా? వీల్లేను..."

"ఇంద్రా, అక్కడే పొరపాటు పడుతున్నావ్-అతడు కేవలం మామూలు మానవుడే కావచ్చు-కాని చాలా మొండివాడు-మొండివాడు రాజుకంటే బలవంతు డనే విషయం నీకు తెలుసు-పైగా మానవుడేగదా అని నిర్లక్ష్యం చేశావనుకో, కొంతకాలానికి నీ పేరూ, రంభ పేరూ పూర్తిగా మాసిపోయే అవకాశా లున్నాయి... అటు రాక్షసుల్నీ యిటు మహర్షుల్నీ, పాదాక్రాంతుల్ని చేసుకున్న రంభ ఒక మామూలు మానవుడి దగ్గర ఓడిపోవడమా?... అయినా జయాపజయాలు దైవాధీనాలు...పాపం. రంభకూ నీకూ కూడా యిది ఒక విషమ పరీక్షే...నారాయణ! నారాయణ!!"

ఇంద్రుడు ఒక్కక్షణం ఆలోచించి,

"మీ సలహా బాగానేవుంది, నారదా... రంభనే పంపుతాను... ఒక మానవమాత్రుడికి యింత అహంకారం తగదు ...రంభా నీ చాకచక్యంతో ఆతడి అహంకారం అణిచి, తగిన బుద్ధి చెప్పిరా... తక్షణం వెళ్ళు. జయం ఎప్పుడూ మనదే..."

"చిత్తం. దేవరవారి ఆజ్ఞ," అంటూ రంభ విధిలేక శలవు తీసుకుంటూంటే, నారదుడు నవ్వుతూ,

''ఏం, రంభా! శరీరం భారంగా వుందన్నావ్! ఇంక తగ్గుతావులే!... భూలోకం వెళుతున్నావ్‌గా!"

"చిత్తం-స్వామీ! యింతకూ ఆ మానవుడు ఎక్కడుంటాడో శల వివ్వలేదే!" అంటూ వినయ విధేయతలతో అడిగింది రంభ-నారదుడు నవ్వి,

"ఆవేశంలోనూ, ఆగ్రహంలోనూ ఇంద్రుడు నన్ను ఆ మానవుడి పూర్తి వివరాలు చెప్పనివ్వలేదు. అతడు భూలోకే, జంబూద్వీపే, భారతవర్షే, భారతఖండే. మేరోర్దక్షిణ దిగ్భాగే కృష్ణా, కావేర్యో ర్మధ్యదేశే, కాంచీమండలే, చెన్నపట్టణే, కోడంబాకే, ఉద్యానవనే, బృహత్‌భవనే నివాసి..."

''వారిపేరు?''...మళ్ళీ అడిగింది రంభ.

"పేరూ ... చంపావు...పేరూ ... పేరూ ... అరెరె! మర్చిపోయానే....వయసు ముదురుతున్నకొద్దీ జ్ఞాపకశక్తి సన్నగిలింది....అతడిపేరూ...ఆ...చక్రపాణి..."

"శలవు, స్వామీ"...రంభ అదృశ్య మైంది....

"భేష్, కథ ఆరంభ మైందన్నమాట. మరి శలవు ఇంద్రా, మళ్ళీ కనిపిస్తాలే... నారాయణ..." నారదుడు వెళ్ళిపోతాడు.

ఇంద్రుడు ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వుండిపోయాడు.

## భూలోకం

చక్రపాణిగారు తన గదిలో మంచంమీద పడుకుని బెంగాలీ పుస్తకం చదువుతోంటారు...సిగరెట్ పడుకున్నప్పుడు మాత్రం

కాల్చరుగనక అలవాటు ప్రకారం చేతులో సిగరెట్ వుందనుకుని రెండు వేళ్ళూ పక్కనే వున్న యాష్ట్రేలో పెడతారు. అంతకు ముందే కాల్చి పడేసిన సగం ఆరనిసిగరెట్ వేళ్ళకు తగిలి చుర్రు మంటుంది ... చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకుని గొణుక్కుంటూ కాలినవేళ్లు గుండెమీద రాచుకుంటూంటారు...

'టక్ టక్' తలుపు తట్టిన చప్పుడు...

"ఎవ రది?"...చదువుతూనే అడిగారు చక్రపాణిగారు. జవాబు లేదు ... మళ్ళీ చదువులో మునిగిపోయారు చక్రపాణిగారు...

కాసేపటికి ఘల్లుఘల్లు మంటూ అందెల చప్పుడు వినిపించింది... ఎదురుగా గోడ కానుకుని చిరునవ్వుతో ఒకఆడది నిలబడి ఉండడం చూసిని చక్రపాణిగారు,

"ఎవు రున్నవ్వు ?" ... అన్నాడు.

"రంభను...

"కూచో...ఏం షూటింగు ?"

రంభ వెలవెల బోతూ, "షూటిం గేమిటీ ?" అన్నది.

"అదే, ఏ పిక్చెరులో వేషం యిదీ ?" అని మెల్లిగా లేచి కూర్చున్నారు...

"ఇది వేషంగాదు...నేను అసలురంభను...దేవలోకంనుంచి వస్తున్నాను"...

"అట్టనా ! ఆ సంగతి ముందే చెప్తే పోలా ?... కామినీభూతం లాగా కిటికీల్లోనించీ, గోడల్లోనించీ రావడానికి తంటాలు పడ్డావేం!.. యియ్యన్నీ మేం సినిమాల్లో జేసే ట్రిక్కులేలే...ఏం కొత్తగాదు.. ఊ...నుంచున్నావేం? ఆ కుర్చీలో కూచో...అస్సరేగానీ...రంభ నంటున్నావ్?...లావుగా వున్నావేం ... యింత లావుగా వుండేది రంభెట్టవుద్దీంట !"...సిగరెట్ వెలిగించారు చక్రపాణిగారు...

రంభ తను లావనే సంగతి యింకొకరి నోట వినడం అదే ప్రధమం...అవమానంతో తల దించుకున్నది...

"అవున్లే, మీరంతా కప్పలు..."

రంభ ఉలిక్కిపడ్డది.

"కప్ప లేమిటీ !..."ఆశ్చర్యంతో అడిగింది రంభ...

"నీళ్ళల్లో వుండేయిలే ... అయి ఎండాకాలం ఎండుతయ్ ... వానాకాలం ఉబ్బుతయ్ ... మీ ఒళ్ళుగూడా అంతే..."

"మీరు అంటున్నారు! నాతోబాటు యింకా లావుగా వుండేవాళ్లున్నారా!...

"ఆ లేకేం! ... మాకూ వున్నారు కొందరు ... అది సరే గానీ, నువ్వేం తింటుంటావ్?"

ఈ ప్రశ్నకు వెంటనే ఏం చెప్పాలో తోచలేదు రంభకు..

"ఏముంది ! పాలు; పండ్లు; అమృతం..."

"అదే...అక్కడే పొరపాటు చేస్తున్నావ్...పాలు కొవ్వు... ఊ! ... సరే పండ్లు ... అది ఫర్లేదనుకో ... యింకెటొచ్చీ ఆ



అమృతం...అదే ఛండాలం...తీపిగదూ?...అసల్లావెక్కేదదే... ముం దది మానెయ్..."

రంభ అయోమయంగా చూస్తూ తల పట్టుకుంది...

"ఏం తల్నొప్పా!...నిన్ను చూడంగానే అనుకున్నా... నీ ఒంట్లో వుండాల్సిన టిష్యూసాల్ట్స్ లేవని...ఊ...అసలీ నొప్పులికి ఒంట్లో సాల్ట్స్ లేకపోవడం కారణం అంటా...ఊ! తల్నొప్పికి 'మెగ్నీషియాఫాస్, నేట్రంఫాస్ రెండిట్లో ఏదైనా వాడొచ్చు... యింకోటిగూడా వుంది...నీకు రెండుకణత ల్నొప్పా? ఒక్క కణత నొప్పా!...దానికి నేట్రంస ల్ఫుందిలే...పార్శపు నొప్పయితే కాల్కేరియా ఫాసూ, మెగ్నీషియా ఫాసూ...ఊ ?...నే ననేదీ... యీటిల్లో ఏదన్నా వాడొచ్చు..."

అసలే విసుగుతో వున్న రంభ పెదాలమీదికి బలవంతంగా చిరునవ్వు తెచ్చుకుని...

"అయ్యో నా కే ఫాసూ వద్దు...మీకు పుణ్యం వుంటుంది... ముందు నే నొచ్చిన విషయాన్ని మనవిచేయనివ్వండి..."

సిగరెట్ 'యాష్ట్రే'లో పడేసి చిన్నగా నవ్వుతూ, "అన్నట్టు నేనూ అడగడం మర్చిపొయ్యాను...ఇంతకీ నువ్వెందుకొచ్చినట్టు యీ లోకానికీ...?"

"మీకోసమే"... అన్నది రంభ వయ్యారం ఒలకబోస్తూ...

"నాకోసమా ! ...నీ కింకెవరూ దొరకలా ?" ... రంభ నవనాడులూ చచ్చిపోయాయి. అవమానంతోనూ, సిగ్గుతోనూ తల వంచుకుంది.

"దొరక్క కాదు...ఇంద్రుడు న న్నొక కఠినమైన దుర్భర కార్యానికి వినియోగించి పంపాడు."

"అట్టనా ? వా డొక సన్నాసి...ఊ ! అంటే నిన్ను తరుంతాడు...నీ కొంగెనకాల దాక్కుంటాడు...ఒట్టి డాంగోడు !"




రంభ లోలోపలే బాధపడుతూ,

"అపచారం ... దేవేంద్రుల నలా దూషించకండి... ముల్లోకాల్లోనూ వారి గొప్పతనం..."

"ఏం టాడి గొప్ప? ఏంటంటా !...పురాణా లన్నీ తీసుకో... ఊఁ! – వా డెందులో కలగజేసుకున్నా గప్పే ... ఏది సరిగ్గ జేసి చచ్చాడు ! ... అహల్యకోసం బోయి నానా ఛండాలం జేశాడా ! ఊఁ ! ఇక ఎవడన్నా గొప్పో డవుతున్నా డంటే ముం దీడికి నిదర బట్టదాయె... అస లాడికంటే యింకోడు గొప్పో డుండగూడ దనే గదా వా డేడుపు... ఊఁ !" గదినిండా సిగరెట్ పొగ కమ్ముకుంది...

ఇంద్రుణ్ణి పెట్టే చీవాట్లకు రంభతల కాస్త తిరిగిన ట్లయింది. తక్షణం దేవలోకం వెళ్ళిపోవా లనిపించింది... కాని తను వచ్చిన పని, తన కర్తవ్యం ఆపింది... అతి బలవంతంమీద ముఖంలోకి నవ్వు తెచ్చుకుని,

"మీరు దేవల్ని అలా దూషించకూడదు. ఏదో గొప్పతనం లేకపోతే ఇంద్రత్వం ఎలా సిద్ధిస్తుంది ? ... అయినా మీరు నమ్మా దేవేంద్రులవారినీ అంతగా దూషించడం న్యాయం కాదు. నా లోపం ఏమిటో చెప్పండి;"...

అంటూ రంభ చక్రపాణిగారు కూర్చున్న మంచం దగ్గిరగా వచ్చింది...

చక్రపాణిగారు కాస్త యిబ్బంది పడుతూ,

"ఎందుకూ ?...అక్కడే కూచో..." అన్నారు.

"ఏమండీ నే నంటే అంత చిరాకు పడుతున్నారు! నే నందంగా లేనా ?..."

"అందంగా లేవ నెవరన్నారు!...లావుగున్నావన్నా...అంతే... అస లందవంటే ఏంటి? ఊఁ! కాల్చిన లవంగం పొట్లలాగుంటవూ?... ఊఁ ! ని వ్వింకా తెల్లం గున్నావ్...నల్లంగుండేవాళ్ళు లావైతే అట్టనే వుంటారు...అస లెందుకంత లావవ్వాలంట !! ఊఁ ! అసలీ్ని వయ సెంత ?... నిన్ను కుమారి రంభనాలా ? శ్రీమతి రంభనాలా ?"

రంభ సిగ్గుపడుతూ తల వంచుకుంది...

"అవున్లే, ను వ్వెందుకు చెబుతావ్..? అసలీ జబ్బు మీ ఆడజాతికే వుందయ్యే...ఎవుణ్ణో ఒకణ్ణి మొగు డనుకునేదాకా ఎన్నేళ్ళొచ్చినా, ఎంత ముసిలిమొకం బడి గిటకబార్నా, కుమారిగానే చెలామణీ గాఒచ్చనుకో...ఊఁ ! అస లా లెక్క జూస్తే నీ వయసు నే జెప్తా... కొన్ని యుగాలు... కొన్ని వేల ఏండ్లు – తెలిసిందా – ఊఁ !...అది సరేగానీ...ను వ్వెప్పుడన్నా ప్యారిస్ హాలీవుడ్ ప్రాంతాల కెళ్ళావా ?"...

"వెళ్ళలేదు... ఆ అవసరమూ కలగలేదు."...

"అంతేలే. ఆ దెవుడిక్కావా ల్నువ్వు ? ఎటొచ్చీ ఆ ఏబ్రాసోడింద్రుడికి దప్ప...అస లీ్నికంటే అందగత్తె ల్లేరని ఉబ్బిచ్చుబ్బిచ్చి



అందమైన ఫోటోలకు
ఫోటో సెంటర్
పార్వతీపురం.

నిన్ను చెడగొట్టిం దాదే గద... పోనీ కలకత్తా ఆడోళ్ళని చూశావా?"...

"లేదు.... ఏం? అంత అందంగా వుంటారా?"...

"ఒక్కందమే గాదంటా ... శానా నాజూగ్గుంటారు ... ఆడోళ్ళందం వాళ్ళల్లోనే జూడాల."

"అలాగా! అందుకే భూలోకంలో రంభంటే ఎవరు?" అని అడుగుతున్నారు...

"అసలడగడం గూడా లేదంటా...సినిమాల్లో చిన్న చిన్నేషాలేసే ఏ ఎక్స్ట్రాదాన్ని జూసినా నీకంటే బాగుంటదంటా. ఊ-! అసల్నిన్ను జూసి మొదటదే అనుకున్నా.

రంభ హృదయం ... అవమానంతో దహించుకుపోయింది. కండ్లల్లో నీళ్ళు తిరిగాయి...

"చూడండీ... పోనీ నే నెట్లా వుంటే అందంగా వుంటానో చెప్పండి?" అంటూ చక్రపాణిగార్ని బ్రతిమాలింది రంభ...

ఎట్టా ఏంది!...ముందా గంతా బొంతా కొంత తగ్గించు. నువ్ నడుం కేసుకున్న వడ్డాణమే వుంటది పదివీశల బరువు... అయినా యియ్యన్నీ ఏసుకొని ఎట్టాడుతున్నావంటా? ఊ! మా సినిమాల్లో జూడు, ఒకొక్కక్కతి ఎంతెత్తెగిరి ఆడతదో!"

రంభ ముఖంలో ఈర్ష్య ఒక్కంత తొంగి చూసింది...

''నేనూ ఆకాశాని కెగిరి ఆడగలను!''

''ఆ యింకే వాడతావ్ లే!"...

''ఆలా అనకండి... చూస్తారా ఆడతాను!''

''ఒద్దులే... నా కోపికలేదు... వూరికే మాట్టాడు... యింకా ఏంటిశేషాలు?''

ఒక్కక్షణం ఆలోచించి చటుక్కున రంభ చక్రపాణిగారి కాళ్ళ దగ్గిర కూచుంది.

"చూడండీ... నాకూ మీ సినిమాలో నటించా లని వుంది. నాచేత నటింపజేస్తారా?''... అన్నది లాలనగా.

"ఏం జేస్తావ్? నీ డాన్సెవడూ జూడ్డు... ఆ ఏబ్రాసో డింద్రుడు దప్ప. ఊ! యిక పెద్దేషా లేం వేస్తావ్? ఏవైనా చిన్న చిన్నేషా లెయ్ ముందు. తర్వాత జూద్దాం. ఊ!''

రంభ వెలవెలబోతూ,

"అయ్యో అలా అనకండి...రంభ చిన్నచిన్న వేషా లేస్తోందంటే నా కెంత అపకీర్తి!...ఏదైనా ముఖ్యపాత్ర యివ్వండి..."

"ఏం యియ్యమంటావ్? - ఊ! యిప్పుడు తియ్యబోయే వాటన్నిట్లోనూ పతివ్రతేషాలే వున్నయ్!..."

"అయ్యో, నే వేస్తాను...నా కెంత కాలంగానో పతివ్రతలా నటించా లని అభిలాష!"...

"అవున్లే...నీలాంటోళ్ళకే అట్టాంటి కోరి కుంటది...అసలు నీలాంటోళ్ళే పతివ్రతేషాలు బాగా జేస్తా రనుకో...అయినా నాకు రెండ్రోజులు టైమియ్య...ఆలోచిస్తా...ఊ ...! నువ్వీలోపల కాస్త ఒళ్ళు తగ్గించుకో!..."



"ఎలా తగ్గుతుంది ?... ఏం చెయ్యాలి ?..."

"ఏవుందీ !... కొవ్వుపదార్థాలు తినబాక – రొట్టె తిను...అక్షూరలు తిను...ఊ!... ఆ అమృతం ముట్టుకోబాక..."

"మరి మా దివ్య శక్తులన్నీ అమృతం మీదనే ఆధారపడి వున్నాయే !... ఏం చేయమంటారు ?"

"ఏంటి మీ దివ్యశక్తులు! ..."

"అదే ప్రత్యక్షం కావడం, అదృశ్యం గావడం, సంకల్ప మాత్రంలో అనుకున్నచోట వాలడం ! ..."

"యియ్యన్నీ ఏం శక్తులంట, బోడి శక్తులు !... ఏ అమృతం దాగి చంద్రమండలం దాటి పోతున్నారు మావాళ్ళు ? ఏ అమృతం దాగి భూతాలు ఎవరి కంట్లపడకుండా ఎక్కడంటే అక్కడ తిరుగుతున్నయ్ ?...ఊ !... ఏ అమృతం దాగి మా సినిమావాళ్ళు ట్రిక్ షాట్లు కనిపెట్టారు?... యియ్యన్నీ శక్తులంటే నా కొళ్ళుమంట... ఊ...!"

"యిక అనకులెండి... యింతకూ నన్నెక్కడ ఉండమంటారు ?..."

"యీ వేళ్ళప్పుడు ఏహోటలికెళ్తావ్‌లే... నా ప్రక్కగది ఖాళీగానే వుంది... అక్కడుండు... మిగతా విషయాలు రేపొద్దున మాట్లాడదాం... ఊ !... నాకు నిద రొస్తావుంది"... ఆవులించారు చక్రపాణిగారు – రంభ మాయమయింది.

చక్రపాణిగారు ఉలిక్కిపడ్డారు...

"అన్నట్టు దీంతో యిదొక పీకులాటే !– ఉన్నట్టుండి మాయమవుద్ది... యింతకీ యిది రంభో, కామినీ భూతంవో ఎవరికి దెల్సు ?... అని గొణుక్కుంటూ పడుకున్నారు చక్రపాణిగారు.

## ఇంద్రలోకం

ఇంద్రుడు శచీదేవితో పాచిక లాడుతుంటాడు. 'నారాయణ' అనే శబ్దాన్ని విని,

"నారదులవారు దయచేస్తున్నారు...నీవు అంతఃపురంలోకి వెళ్ళు, దేవీ...వారితో నే నొక అవసరమైన విషయం మాట్లాడాలి" అంటూ శచీదేవిని లోపలికి పంపించి నారదులవారికి ఎదురు వెళ్ళి నమస్కరించాడు ఇంద్రుడు.

"దయచేయండి మునీంద్రా...మీ రాకకోసమే ఎదురు చూస్తున్నాను." అంటూ ఆసనం చూపించాడు...

"నేనూ అందుకే వచ్చాను...యిది కూర్చుండే సమయం కాదు...త్వరగా బయల్దేరు...లేకపోతే రంభను దక్కించుకోలేవు"...అన్నాడు నారదుడు...

"ఇంద్రుడు ఖంగారు పడిపోతూ,

"ఏమైంది నారదా ? రంభ కుశలమేగదా?...ఎంతవరకు వచ్చింది ఆమె ఆడుతున్న నాటకం ?"...

"ఆ ! గొంతువరకూ వచ్చింది...ముందు బయల్దేరు...ఆ విషయా లన్నీ తీరిగ్గా మాట్లాడుకుందాం,"...

"ఏమిటి నారదా ? రంభ అపజయం పొందిందా ?...చెప్పండి!" అంటూ ఆదుర్దా పడుతున్న ఇంద్రుణ్ణి చూసి,



"అవ్వన్నీ యిప్పు డడక్కు...ఆ మానవుడు రంభకు లొంగక పోగా రంభచేత సినీమాలో వేషం వేయిస్తున్నాడు...రంభ నాహారం తిననివ్వకుండా పస్తులుంచుతున్నాడు...ఏవో రొట్టెలట... అవి తిని యిన్ని నీళ్ళు తాగి వుంటూంది రంభ...ప్రస్తుతం చిక్కి శల్యావస్థలో వుంది... ఆహారంకంటేగూడా రంభ చిక్కడానికి కొంత మనోవ్యాధికూడా కారణం అని నా అభిప్రాయం."...

"రంభకు మనోవ్యాధా?"...

"అవును...ఎంతకీ లొంగని ఆ మానవుడిదగ్గర పరాజయం పొంది, తన ముఖం దేవలోకానికీ, నీకూ తిరిగి ఎలా చూపించడమా అనే మనోవ్యాధి...అందుకే తనే కోరి సినీమాలో వేషం వేస్తోంది."...

"అవురా!...కేవలం ఒక మానవుడు రంభకు లొంగలేదా! యింత అపజయమా!"...పళ్లు పటపట కొరికాడు ఇంద్రుడు...

"అంత గట్టిగా కొరక్కు...విరిగిపోతాయేమో! చూడూ...ఆవేశపడి లాభంలేదు...జయాపజయాలు దైవాధీనా లని ముందే చెప్పానుగా!...అయినా బూడిద పూసుకున్న సన్యాసుల్నీ, తలలేని రాక్షసుల్నీ అయితే రంభా, నువ్వూ ఆడించగలిగారు గానీ, భూలోకంలో ఆ సినిమా జీవులదగ్గిర మీ ఆట లేవీ సాగవని నేనప్పుడే అనుకున్నాను...వాళ్లు దేవతల్నే ముప్పతిప్పలు పెట్టే అసాధ్యులు."

"మరి ఈ సంగతి ముందే ఎందుకు చెప్పలేదు, నారదా!...నేనే స్వయంగా —"

"అయ్యో, అదే పొరపాటుసంగతి...నువ్వు ఏ కారణంచేతనైనా సరే ఆ మానవుడి ఎదట బడకు... నీ పేరంటేనే అతనికి అరికాలి మంట..."

"ఆఁ? ఏమిటీ అపజయం?...పద, నారదా తక్షణం కదులు, రంభను చూడాలి..."

"పద...అందుకేగదా పరుగెత్తుకొచ్చాను...? రంభపాట్లు చెప్పడానికి వీల్లేదు...పాపం..."

## భూలోకం

స్టుడియోలో ఎవరికంటా బడకుండా ఇంద్రుడూ, నారదుడూ రంభకోసం వెతుకుతుంటారు...

ఒకచోట బ్రహ్మాండమైన దర్బార్ సెట్టులో డాన్సు జరుగుతూంటుంది.

"నారదా!...అదుగోరంభ,'' అంటూ నృత్యం చేస్తున్న నర్తకిని చూపిస్తాడు ఇంద్రుడు...

"హయ్యో పిచ్చివాడా!...ఆమె రంభగాదు...రంభవేషం వేసి ఆడుతున్న సినీమా నర్తకి...ఆ దర్బార్ నీ దర్బారే...ఎదురుగా సింహాసనంమీద కూర్చున్నవాడే ఇంద్రుడు...నీవేషం వేసి ఆనర్తకి



నాట్యాన్ని చూసి ఆనందిస్తున్నాడు..." ఇంద్రుడిముఖం వెల వెల బోతోంది...

"నిజంగానా, నారదా ?... ఎంతో భ్రాంతిజెందాను! ... ఛీ ఛీ! ఆ దౌర్భాగ్యుడా ఇంద్రుడు! ... చీకటి కండ్లూ వాడూనూ..."

"అయ్యో పిచ్చిఇంద్రా !"... యితడు చాలా నయం... ఒక మోస్తరు నటుడు...ఒక్కొక్కసారి వీళ్ళు తీసే కొన్ని చిత్రాల్లో సమయానికి ఎవరూ దొరక్కపోతే, ఏ చాకలివాడికో నీ వేషం వేస్తారు !"

"ఛీ ఛీ ! నా కేలోకంలోనూ ఇంత అవమానం జరగలేదు... ఎందు కింక నా కీ ఇంద్రత్వం, ఏడవనా ?"... అంటూ ఇంద్రుడు తల పట్టుకున్నాడు...

"మరీ ఆ విధంగా బెంబేలు పడకు ... ఏం జేస్తాం ? నువ్వు ఇంద్రలోకంలోనే కూర్చుని భూలోకం ఎంత ముందంజె వేస్తోందో గమనించలేదు... చంద్రమండలంకూడా అధిగమించి వెళ్ళగలుగుతున్నారు మానవులు... మనం దివ్యశక్తు లనే వన్నీ వాళ్ళకు యంత్రశక్తులుగా పని చేస్తున్నాయ్ ... అన్ని లోకాలూ వీండ్లు భూలోకంలోనే సృష్టించ గలుగుతున్నారు ... 'స్వర్గం అంటే ఏమిటి ?' అని అడుగుతున్నారు..."

"అవురా! ఏమి టీ కాలవైపరీత్యం !..." అంటూ ఇంద్రుడు దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు...

"చెప్పానుగా? యింకా చాలా వుంది నీకు భూలోకాన్ని గురించి తెలుసుకోవలసింది ... ముందు రంభ జాడ తెలుసుకోవాలి. ఆ మానవు డెక్కడుంటే రంభ అక్కడుంటుంది... పద పోదాం..."

## ఊరుబయట ఉద్యానవనం

అవుడ్డోర్ షూటింగ్ జరుగుతూంటుంది – ఇంద్రుడూ, నారదుడూ ఎవరికీ కనబడకుండా చెట్లచాటున దాక్కుని చూస్తారు... పాట వినిపిస్తుంది ... ఇంద్రుడి ప్రాణం లేచొస్తుంది ... కొంచెం ముందుకు వెళ్ళి చూస్తాడు ...

"నారదా! అటు చూడు !– అక్కడ ఆడుతూ పాడుతూన్నది మన రంభేగదూ ! ..."

"ఇంద్రా ! ... నిన్ను ఆ మానవుడు, చక్రపాణి, ఎందుకు చెడామడా తిడుతున్నాడో నా కిప్పుడు అర్థ మౌతోంది... నీకు మరీ యింత మతి పోయిం దేమిటీ?– నీ రంభను నువ్వే గుర్తించలేక పోతున్నావే !... ఆ ఆడుతూ పాడుతూన్నది ఉలూచీ పాత్రధారిణి ఒక ప్రముఖ సినిమానటి ... తెలిసిందా? "

ఇంద్రుడి ముఖం చిన్నబోయింది...

## అడవి ప్రదేశం

చుట్టూ రాళ్ళగుట్టలూ, ముళ్ళపొదలూ వుంటాయి ... ఎండ తీక్షణానికి కొండరాళ్ళూ వేడి కక్కుతుంటాయి ...

అవుడ్డోర్ షూటింగ్ జరుగుతూంటుంది... జుట్టు విరబోసుకుని, మాసిన గుడ్డలు కట్టుకుని, గుండెలు బాదుకుని ఏడుస్తూ పాడుతున్న ఆడది కనిపిస్తుంది ...

నారదుడు చటుక్కున ఒక చెట్టువెనక ఆగి,

"ఇంద్రా అటుచూడు ! ఆ ఏడుస్తూ పాడున్నది మన రంభలా వుందే!..."

"ఛీ ఛీ !... యిప్పుడు మీకు మతిపోయింది, నారదా ! ఆ పాత గుడ్డలు కట్టుకుని ప్రేతంలా వున్నది రంభెలా అవుతుంది? అదేదో మామూలు మానవి..."


నారదుడు నవ్వి, అటుచూడు నీ విరోధి ఆ చెట్టుకింద కూర్చొనున్నాడు..." అంటూ, సిగరెట్ తాగుతూ కుర్చీలో కూర్చొనున్న చక్రపాణిగార్ని చూపించాడు ... ఇంద్రుడి గుండె గతుక్కుమంటుంది... తేరిపారచూసి "రంభే!...నారదా, ఏమి టీ దుర్గతి?.." అంటూ కుప్పకూలిపోయాడు ఇంద్రుడు...షాట్ మధ్యలోనే కట్ కట్ అంటూ అరిచారు చక్రపాణిగారు ... రంభను కేకేశారు చక్రపాణిగారు... భయపడుతూ దగ్గిరి కొచ్చింది రంభ...

"అదేం ఏడుస్తా కులుకుతావ్...యి దేం డాన్సా ?... అందుకే మొదట్నే జెప్పాగా ! ... ఏడ్చేటప్పుడు కులకబాకనీ ! ... కండ్లల్లోంచి నీళ్ళు గార్తున్నయ్యేగాని మొకంలో విచారం కనపట్టం లేదే ! ఊ ! వూరికే గుండెలు బాదుకుని ఏం లాబం ! సరిగ జెయ్, యిప్పుడు ఫిలింగూడా దొరకడంలా...పతివ్రతేషం మరి..."

"ఆలాగే ... యీసారి సరిగా చేస్తాను..." నీరసంగా తిరిగి వెళ్ళింది రంభ ...

"నారదా ! రంభ కేమి టీ గ్రహచారం !... తక్షణం రంభను దేవలోకానికి తీసుకుపోతాను ... యింక క్షణంగూడా వుంచను."

"త్వరపడకు. ఇంద్రా ! యీ అపజయానికి రంభ అంగీకరిస్తుందా !... అయినా అడిగిచూడు"...



"మహాజనులారా ! యువతీ యువకులారా : దీపావళికి మాత్రమే ప్రత్యేక అమ్మకం : మీ మీ అభిమాన సినీతారల అద్దకం బెడ్‌షీట్లు — దుప్పట్లు ! సరుకు కొద్దిగా ఉంది — ఆలసించిన ఆశాభంగం !......"

ఒక చెట్టువెనకాల నిలబడి మేకప్ సరిదిద్దుకుంటున్న రంభను సమీపించాడు ఇంద్రుడు...

"రంభా !"

రంభ వులిక్కిపడ్డది...

"ఏమి టీ వేషం?... యీ ఖర్మ మేమిటి నీకు!" రంభ గాభరా పడుతూ,

"ఇప్పుడు ఇక్కడి కెందు కొచ్చారు మీరు !... చక్రపాణిగారు చూస్తే కోప్పడతారు... అసలే కోపంగా వున్నారు నేను సరిగా నటించడం లేదని...వెళ్ళండి"...

కోపంతో ఇంద్రుడు పళ్ళు పటపట కొరుకుతూ,

"మూర్ఖురాలా! నీ వల్ల నేను తలవంచుకోవలసిన పరిస్థితి ఏర్పడ్డది...పద దేవలోకానికి..."

"క్షమించండి. నేను రాను...ఇక్కడే వుండిపోతాను"...

ఇంద్రుడికి ఒళ్ళు మండిపోయింది.

"ఛ, ఛండాలురాలా !... పొందిన అపజయం చాలక కేవలం మానవిలాగా వేషా లేస్తూ యిక్కడే వుంటా నంటావా ?"

"అవును ప్రభూ...ఎటూ అపజయం పొందాను...భూలోకంలోనైనా చిత్రాల్లో నటించి కళాసేవ జేస్తూ పేరుప్రతిష్ఠలు గడించుకుంటాను...ఎంతకాలం దేవలోకంలో వున్నా, మీ దర్బార్లో నాట్యం చేయడంతప్ప, యీ విధంగా నటించే అవకాశం ఏదీ !... పైగా నా ప్రతిబింబాన్ని నేనే తెరమీద చూచుకోడం నా కెంతో సరదాగా వుంది...నేను నటించే చిత్రాలు మీరుకూడా దేవలోకం తీసుకెళ్ళి అక్కడ కూడా అందరికీ చూపించవచ్చు. దాని క్కావలసిన యంత్రాలన్నీ చక్రపాణిగారితో చెప్పి నేను పంపిస్తాను...నాట్యం చేయడం ఎంతో సులభం కాని నటించడం చాలా కష్టం... బాగా నటించి మెప్పించగలిగితే, నేను ఒకవిధంగా అపజయం పొందినా యింకో విధంగా విజయం సాధించగలుగుతాను...నేను నటించబోయే చిత్రాలు..."

"ఛాలు - దౌర్భాగ్యురాలా : దీని నొక విజయంగా భావిస్తున్నావా ఆ మానవుడిని లొంగదీయలేకపోగా ఆత్మాభిమానం చంపుకుని, అతడి పంచనే వుండి వేషా లేస్తావా ? నీవల్ల దేవలోకానికీ, నాకూ తీరని కళంకం ఏర్పడ్డది...ఛీ ఛీ, ఏంత అపజయం !...ఎంత అవమానం !"

"నారాయణ...శాంతించు ఇంద్రా. రంభ చెప్పేదీకూడా కాస్త విను"...

"ఇక నే నేమీ వినదలచుకోలేదు...రంభా, యీ పిచ్చి పిచ్చి వేషాలు కట్టిపెట్టి తక్షణం కదులు...నీ వుండాల్సిన చోటు యిది కాదు...దేవలోకం...వెంటనే అదృశ్యం కా..."

"నారాయణ...యిం కేం అదృశ్య మౌతుంది, ఇంద్రా...అమృతం తాగడం మానేసిందిగా ?...ఆ శక్తులన్నీ ఎప్పుడో పోయాయి!"

"ఆలాగా ? అమృతం ఎందుకు తాగడంలేదూ!...నీవు కావాలంటే సంకల్పమాత్రంలో వస్తుందే!"...

"లావవుతున్నా నని నేనే మానేశాను...తీపిగదూ?...చక్రపాణి గారు వద్దన్నారు...నాకూ యిష్టంలేక మానేశాను.... నన్ను పోనివ్వండి...చక్రపాణిగారు కేకేస్తున్నారు...ఎండ పోతోంది మళ్ళీ..."

"ఎండకాదు, నీ ప్రాణం పోయినాసరే...నిన్నుమాత్రం ఇంక ఒక్కక్షణం యిక్కడుంచను..." అంటూ రంభ చేయి పట్టుకో. బోయాడు ఇంద్రుడు...రంభ చటుక్కున వెనక్కు తప్పుకుని,

"నేను రాను...నన్ను బలవంత పెట్టకండి...నేను నటించే యీ చిత్రం యిప్పుడే ఆరంభం అయింది ... పూర్తి చేయకుండా వెళితే చక్రపాణిగారు నన్ను తిడతారు..."

"నారాయణ...ఇంద్రా మీరిద్దరూ ఆ మానవుడిదగ్గర ఎటూ ఓడిపోయారు...పోనీ సరదా పడుతోంది...రంభను కొంతకాలం యిక్కడే వుండనీ..."

"నువ్వూరుకోవయ్యా...రంభా, వస్తావా రావా?..."

"రాను—" అంటూ పారిపోబోయింది రంభ—

"గుబుక్కున వెళ్ళి రంభ చెయ్యి పట్టుకున్నాడు ఇంద్రుడు... మరుక్షణం రంభ, ఇంద్రుడు, నారదుడు ముగ్గురూ అదృశ్యులైనారు...

"ఏదీ, ఎంతకీ రాదేం...! అయినా ఏడుపుసీను కెందుకంట అంతచేటు మేకప్పు...! పిలవండి ఎండ పోద్ది..." అన్నారు చక్రపాణిగారు.

"రంభగారూ!... రంభగారూ! అంటూ రంభకోసం అడవంతా వెతికాడు, అసిస్టెంట్ డైరక్టరు అర్ధనారీశ్వరం...

"ఎక్కడ కనిపించకపోయేసరికి ఖంగారుపడుతూ చక్రపాణి గారి దగ్గిరికి పరుగెత్తుకొచ్చాడు...

"సార్! సార్! కొంప మునిగింది...రంభగారు కనిపించడం లేదు..."

"సరిగ్గెతికావా?..."

"అడవంతా గాలించాం...కనిపించలా...యిందాక ఎవర్తోనో ఘర్షణ పడుతున్నట్లు అమె ఆ చెట్టువెనకాల మాట్లాడుతూంటే చూశాను...కాని ఆ ఎదుటివ్యక్తి ఎవరో కనబళ్ళేదు..."

"యింకెవురు! ఆ సన్నాసో డింద్రుడే అయుంటాడు...ఇది ఎంతకీ తిరిగిరాకపోతే వాడే వచ్చినట్టున్నాడు...నే నడిగితే పోనందే! ఎట్ట బోయిందీ? ఊ!... నేనప్పుడే అనుకున్నా దీంచే తేషం వేయిస్తే యీపీకులాటుంటందని...సరే ఏం జేస్తాం?.. తీసినంత వరకూ పీకేసి యింకెవర్నన్నా ఏద్దాం...యింక బోదాం..." అంటూ కుర్చీమీదున్న కండువా పైనేసుకుని సిగరెట్ డబ్బా చేతిలో పుచ్చుకుని లేచి నిలబడ్డారు చక్రపాణిగారు...

"షూటింగ్ పేకాఫ్" అంటూ ఎవరో అరిచారు...ఉలిక్కిపడి కండ్లు తెరిచాను...పగటికల. గంట చూస్తే అయిదయింది...

"దీపావళి వస్తావుంది, ఏదన్నా రాశావా?" అంటూ మధ్యాన్నం భోజనాల సమయంలో టెలిఫోన్ చేశారు చక్రపాణిగారు...

"ఆ రాశాను...అంటూ కూశాను...

"మరి పంపరాదూ?...అన్నారు.

"యింకా ఫేర్ చెయ్యలా...నిన్నటివరకూ పని వుండింది..."

"యీరోజు లేదుగా?''

"లేదూ...కాని ఎవరో ఒకమ్మాయి సినిమాల్లో చేరాలని ఉన్నపళంగా యిల్లు విడచి వచ్చేసింది....ఆ అమ్మాయేమో అందంగానే వుంది...కాని...''

''ఏం జేసుకుంటా వంట అందం...కొరుక్కు తింటామా? యిప్పు డొచ్చేయన్నీ యిట్లాంటి చూపులగాడ్లే...డైలాగ్ చెప్పమంటే బెబ్బెబ్బె అంటారు...యింకా యా ట్రేంజేస్తారు?...ఊ"

నాకు నవ్వొచ్చింది...కాసేపు మాటాడి ఫోన్ పెట్టేశాను...

అసలు రంభే దేవలోకంనుంచి దిగి చక్రపాణిగారిదగ్గర కొస్తే దానిపాట్లు ఎలా వుంటాయో సరదాకి నాలో నేను ఆలోచిస్తూ పడుకున్నాను...ఎప్పుడు నిద్రపట్టిందో!...కల.

అదే రంభా చక్రపాణీయం అయింది...

